# నల్లమబ్బులు

డాక్టర్ జయరామ్. భార్య సుశీల పోయినందుకు బెంగతో మంచమెక్క లేదు. కానీ కాలం జరుగుతూన్న కొద్దీ, తనమీద తనకే విసుగు పుడుతోంది అని తనవారితో చెప్పు కుంటున్నాడు.

దూరపు బంధువు జయమ్మ వోదార్చేందుకు వచ్చి, మళ్ళా పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చి, పిల్లల జాబితా ఏకరువు పెడుతోంది.

జయరామ్ ఇంక చాలునని కటువుగా జయమ్మకి చెప్పి మేడపైకి వెళ్ళిపోయాడు.

సుశీల తన స్నేహితురాలికి పోయేముందు వ్రాసిన వుత్తరం అది. ఆ స్నేహితురాలు జవాబు వ్రాస్తూ తనకి వ్రాసిన వుత్తరం మళ్ళీ చదువుకోమంటూ, సుశీలకి పంపింది. చదివేందుకు సుశీల లేదు. జయరామ్ మొదట చదవకూడ దనుకున్నా ఏం వ్రాశిందో చూడాలన్న కోరిక, ఆలోచనలకి అడ్డుపడి వుత్తరం చదివేటట్టు చేసింది.

మొదట ఇంత పెద్ద వుత్తరం వుందేమిటి? అన్న విసుగుతో బల్లమీదికి విసిరి వరండాలో అటూఇటూ తిరుగుతున్నాడు. మళ్ళీ ఉయ్యాల గొలుసులు వంకర తిరిగేలా ఓ చివర కూర్చొని వుత్తరాన్ని తీసుకొన్నాడు.

మీనాక్షికి వ్రాసిన కుశల ప్రశ్నలు ఓ పేజీలో సర్దుకున్నాయి. ఏమిటో మీనా నాకేమీ మనస్సు బాగుండటం లేదు అని రెండో పేజీలో మొదటే స్వంతవిషయం విప్పింది.

పెళ్ళి అయిన కొత్తలో ఆరు నెలలేనా ఇన్నేళ్ళ కాప రంలో వెలుతురులో నిండివుంది అనుకుంటున్నా. ఆ రోజులలో జయరామ్ ప్రాక్టీస్ పెట్టిన కొత్త. ఎక్కువ టయిమ్ ఇంట్లోనే గడపటం చూసి అత్తగారు, ఆడబిడ్డలూ, ఆడిపోసుకోవటం వినలేక నేనే అతన్ని ఎక్కువ ఇంటికి రావద్దని లేనికోపం తెచ్చుకొని విసుక్కునేదాన్ని. నేను నిజంగా అనటం లేదని నవ్వించి బయటికి వెళ్ళేవారు. ఆ యేడు వేసంగి శలవలకి సుధ తమ్ముడుని తీసుకువచ్చింది. అమ్మాయి రాక మొదట చాలా సంతోషంగా అనిపించినా ఆ సంతోషం వారం తిరక్కుండానే మాయమైంది.

సుధ ఎప్పుడూ జయరామ్ వున్నచోటే వుండటం చూసి మళ్ళా అత్తగారూ ఆడబిడ్డలూ గుసగుసలు. ఏమిటో అర్థంకాక ఎవర్నైనా అడిగితే ఏమనుకుంటారో అన్న భయం. పోనీ రామ్‌నే అడుగుదామన్న నిర్ణయానికి వచ్చా. ఇంతలో వంటావిడ అతి తేలిగ్గా పక్కింటి ఆవిడకి చెప్పే మాట వినపడింది. అమ్మాయే ఇతను చదివే రోజుల్లో చేరిందట. దాన్ని తప్ప ఎవర్నీ పెళ్ళి చేసుకోనని కూర్చుంటే, తల్లీ తండ్రీ వెళ్ళి ఎంతో అవస్తపడి డబ్బు ఇచ్చి వదుల్చుకున్నారని చెప్పుకుంటూరు. మరి ఎంత నిజమో దేముడికే తెలియాలి. పెళ్ళికాక మునుపు ఏదో జరిగిందే అనుకో. మళ్ళా వచ్చిందేమిటి? అంటూ అవతలావిడ ఆశ్చర్యం వెళ్ళబోస్తోంది. వాళ్ళమాటలు వినలేక లోపలికి వెళ్ళిపోయా. మనస్సులో మంటల్లా మెరు

స్తున్నాయి. సుధ గురించి కథలు. ఆ నెలరోజులు నేను పడ్డ బాధ ఇప్పుడు నీకు వ్రాయలేనంటే నమ్మె. మరోసాటి తలుచుకున్నా మనస్సు మండిపోతోంది. జయరామ్‌కి అప్పుడు నేనే పరాయిదానిలా తోచివుంటాను. నేను ఏదయినా అడిగితే నవ్వి వూరుకునేవాడు. సుధని రైలు ఎక్కించేందుకు నన్ను కూడా రమ్మంటే నేను ఒప్పుకోలేదు. ఆవిడికి ఎందుకులే శ్రమ వద్దని సలహా ఇచ్చింది సుధ. మళ్ళా నేను వస్తానని జయరామ్‌కి చెప్పా. వద్దులెద్దు అంటూ జీప్‌లో సుధని పక్కన కూరోబెట్టుకుని వెళ్ళిపోయాడు. అల్లా జరిగితే ఎంత బాధగా వుంటుందో వూహించగలవా?

నేను సుధ విషయం అడిగేందుకు అవకాశం లేకుండా చెల్లెలును తీసుకుని పట్నం వెళ్ళాడు ఆ మర్నాడు.

సుధ విషయం ఓ రోజున అడిగే అవకాశం వచ్చింది. మీరు చేసుకోవాలి అనుకున్నారటగా! సమాధానం అవును అని. అయితే మరి నన్ను ఎందుకు చేసుకున్నారు. వచ్చేదుఃఖం ఆపుకుంటూ అడిగా. మీ నాన్న ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు కనక.

ఇవి అన్నీ మా నాన్నకేమి తెలుస్తాయేమిటి? మాటలు రావటం లేదు. ఎందుకు అంత అవస్తపడతావు? అంత కష్టం ఏమి వచ్చిందని, ఆ ఏడుపు. ఏడిచేవాళ్ళంటే నాకు గిట్టదు అంటూ అక్కడనించి జయరామ్ వెళ్ళిపోయాడు.

సమయం వచ్చినప్పుడల్లా నేను సుధ మాట ఎత్తటం, మాటలు పెరిగి పెరిగి కొన్నాళ్ళు మాటలు లేకుండా గడిచి మళ్ళీ సమాధాన పడటంతో కొన్ని ఏళ్లు జరిగాయి.

ఆ విషయం నేను ఎత్తటం మానేసి చాలకాలమయినా ఇరుగూ పొరుగూ చెప్పుకుంటూనే వున్నారు.

మళ్ళీ మా ఇంట్లో సందడి మొదలుపెట్టింది. మా మరిది భార్య రాకతో సుధ తనకి బాగా తెల్సునని అందరికీ తలో రకంగా చెపుతూ జయరామ్ వచ్చేవేళకి సుధ చక్కదనం గురించి తెగపొగుడుతూ గట్టిగ మాట్లాడేది. కొన్నాళ్ళు నేను వాదానికిదిగినా నాకు నేనే సమాధానపడి నా స్థానం పెరటిలో బొగడచెట్టు కిందకి మార్చుకున్నా. కొత్తగా కాసిన జామిచెట్టు నిండా రామచిలుకలు చేరి చేసేసందడి చూస్తూ గడపేదాన్ని.

నన్ను నేను మర్చిపోయేందుకు నేను ఇంకెవరిగానో వూహించుకుంటూ పెద కథలా ఎందరినో ఆ కథలో మనుష్యుల్లా చూస్తూ దుఃఖించవస్తే ఏడుస్తూ సంతోషంవస్తే నవ్వుతూ అందులో కాలం గడపటం సులువుగా తోచి తీరిక దొరికినప్పుడల్లా మరో లోకలో వున్నట్టు వూహించుకుంటూ కొంతకాలం గడిపా. దానికి విఘ్నంగా మా దొడ్లో కుక్క పిల్లల్ని పెట్టి చచ్చిపోయింది. మిగిలినపిల్లలు ఎటు పోయాయో ఎవరూ పట్టించుకోలేదు. అందులో నల్లమచ్చలు వున్న కుక్క పిల్ల నన్ను వదలకుండా నా కళ్ళల్లోకి చూస్తూ నా దగ్గరే గడపడంతో మళ్ళీ కుక్కపిల్లతో గడపడం మనస్సుకి కొంత కొత్తదనం ఆపాదించింది. ఆ కుక్కపిల్ల రాక ఆ ఇంట్లో ఓ రెండు పార్టీలుగా తేలింది. మా తోటికోడలుకి దాన్ని చూస్తే చంపేద్దామా అన్నంత అక్కసు వెళ్ళపోస్తుంది. మా అత్తగారికి కొంచము ఇష్టము, కొంచము చిరాకు అవటం వల్ల అతను ఇంట్లో వున్నంతసేపు కుక్కపిల్లకోసం భార్యా

భర్తలు కొట్లాడుకోవడం సరిపోతుంది. ఇంక జయరామ్‌కి ఇంటి దగ్గర వుండే తీరికేది? నాలుగు వూళ్ళకి ఒక్క డాక్టరు అన్న పేరు మొయ్యలేక కీర్తిని పెంచేందుకు కొత్తకారు కొనుక్కుని నర్సుని తీసుకుని ఆ వూళ్ళు తిరిగి వచ్చేసరికి ఏవేళైనా అవ్వొచ్చు. ఎప్పుడో కాని నాతోటి మాట్లాడరు. ఇంక కుక్కపిల్ల ఎందుకు? ఆ రోజు జయరామ్ భోజనానికి చాలా ఆలస్యంగా వచ్చాడు. మా తోడికోడలు రొప్పుతూ పుట్టింటినించి వచ్చిన వుత్తరం పట్టుకొచ్చింది. సుధ భర్తపోయాడుట పాపం. ఇంకా ఏడాదన్నా కాలేదు పెళ్ళయి, అంటూ తడిలేని కళ్ళని కొంగుతో వొత్తుకుంటోంది. జయరామ్ వుత్తరం తీసుకు మళ్ళా చదువుకుని పెదిమ విరిచి, విచారం తెలుపుకున్నాడు. ప్రకృతికి సుధమీద ఆ యింట్లో సానుభూతి పెరిగింది. వొక్కొక్కరే విడివిడిగా వుత్తరాలు వ్రాస్తున్నారు. నాకు మళ్ళా జీవితంలో ఏదో పోతున్నట్టు బాధ. ఈసారి నా మనస్సులోది ఎవరికీ తెలవదు. నాలో నేనే వుండిపోయా. నా కుక్కపిల్ల నన్ను వోదారుస్తూ వుంటుంది. నాన్న దగ్గరనుండి వుత్తరం వచ్చింది. వ్యాపారంలో నష్టం వచ్చిందట. మొగపిల్లలు ఎవరూ ఆదుకోవటం లేదుట. అల్లుడు ఏమైనా సర్దుతాడేమో అడగమంటూ. నాకు అప్పుడు నిజంగా అభిమానం వచ్చింది. మళ్ళా ఆయన ఆకారం కళ్ళముందు మెదిలినట్టుంది. ఒక్క శరీరం కోటులో దాచుకుని ఇన్ని అవస్థలు పడుతున్నాడు. ఎవరికోసమో! ఈ కాపన్నం వదులుకుంటే బాగుండును.

తనుమాత్రం డబ్బువిషయం జయరామ్‌ని అడగదల్చుకో లేదు. నాకు అప్పుడప్పుడు గుండెదడ, నొప్పి వస్తున్నాయి.

మొదట్లో కబురుపెడితే జయరామ్ నర్సు వచ్చి మందు ఇచ్చి వెళ్ళేది. ఇప్పుడు కబురుపంపటం మానేశాను. అప్పుడప్పుడు రావటం పరిపాటయిపోయింది. నిన్నరాత్రి నొప్పి చాలా ఎక్కువగా వచ్చింది. కాళ్ళు చేతులూ తిమ్మిరెక్కాయి. అయినా జయరామ్‌ని లేపలేదు. ఎప్పుడో వాళ్ళు అంతా మొద్దుబారుతుంది అంతే. ఇప్పుడు నాకు చచ్చిపోతానన్న భయంలేదు. మా గోడ వెనక గుడిసెలో గంగమ్మ ప్రాణం కొట్టుకుపోతూ వుంటుంది. అంతమంది పిల్లలతో అది చేసుకున్న వాడి చేష్టలు తలుచుకుని ఏడ్చిఏడ్చి ఎగిరిపోయింది.

బాధపడని జీవుడు వుండడేమో నువ్వు ఎంత అదృష్టం చేసుకున్నావో అనిపిస్తోంది. నీలా సుఖంగాగడిపే సంసారాలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఇంకా వ్రాయాలని వుంది. ఇప్పటికే నువ్వు విసిగిపోయి వుంటావు. ఇవాళ జరిగిన సంగతి వ్రాసి పెన్ను మూసేస్తా. గుండెల్లో నెప్పి వుండివుండి వస్తోంది. కడుపులో తిప్పుతోంది. ఎల్లాగో డిస్పెన్సరీకి వెళ్ళగలిగాను. జనంతో కిటకిట లాడుతోంది. జయరామ్ వచ్చి కబురు చెయ్యకపోయావా? నువ్వెందుకు రావటం అని మొహం చిట్లించుకున్నాడు. తల దిరుగుతోంది. ఇంటికి వెళ్ళాలని వెనక్కి తిరిగాను. మెట్లమీదకి తూలటం తెలుస్తోంది. శరీరం నాకు లొంగలేదు. నాకు మెళుకువ రావటానికి పొద్దు తిరిగింది. జయరామ్ స్నేహితుడు పక్కన నిల్చుని పరీక్ష చేస్తున్నాడు. ఎల్లావుంది అని అడుగుతున్నాడు. వాళ్ళ మొహాల్లోకి చూడలేక కళ్ళు మూసుకున్నా. మళ్ళీ అతనే ఇంటికి వెళదామా, అని

మాటమార్చి అడుగుతున్నాడు. నర్సువచ్చి పట్టుకోబోయింది.

జయరామ్ కళ్ళల్లో తడి మెరిసింది. లేవగలవా సుశీ! అంటూ దగ్గరగా నిల్చుని అడగటంతో నాలో దాగిన దుఃఖం కట్టలు తెగిన నదిలా బయటపడి పసిపిల్లలా అర్థంలేకుండా ఎంత సేపో ఏడ్చాను. ఆ క్షణంలో జీవితం చాలిస్తే ఎంత బాగుండును అనిపించింది.

మళ్ళీ జీవితంమీద మమత పెరుగుతోంది. కానీ నన్ను అడక్కుండానే శరీరం, జీవుడు, తొందరలోనే విడిపోతారని పిస్తోంది. వాటికి సఖ్యత కొంతకాలంగా వుండటంలేదు. నా పరిసరాలు నన్ను తొందరగానే మర్చిపోతాయి. నాకు వారసులులేరు. జయరామ్ భవిష్యత్ సుధతో సుఖంగా గడచిపోవచ్చు.

నాకు బంధంగావున్న కుక్కపిల్ల రెండు రోజులనించి కనపడటంలేదు.

ఎక్కడవుందో పాపం. దానికి ఆకలి అయితే దీనంగా నా కళ్ళల్లోకి చూసేది. నా వొళ్ళో తలపెట్టుకు తోకఆడిస్తూ గారంచేసేది. మాటలురాని పసిపిల్లలా నన్ను కవ్విస్తూ నా చుట్టూ తిరిగేది. మా యింట్లోవాళ్ళు దాని విషయం ఎక్కువ పట్టించుకోరు. నాకు యిప్పుడు ప్రతి చిన్న విషయం పెద్ద సమస్యగా తోస్తోంది. ఇంక నా సొద ఆపుతున్నా. మళ్ళీ వ్రాయగలిగితే మరోసారి వ్రాస్తా. అన్నట్టు మీ పాపాయి ఎవరిలా వుంటుంది ? నాకో ఫోటో పంపలేదేం. నా దగ్గర చిన్న పిల్లల ఫోటోలు వున్న పాంప్లెట్స్ ఎన్నో వున్నాయి. వాటిలో ఎవరిలావుంటుందో పోల్చి వ్రాస్తా. మరివుంటా –

జవాబు ఆ వుత్తరంలోనే ఖాళీగావున్న కొద్దిచోటులో మీనాక్షి అక్షరాలు ఇరుగ్గా వ్రాసింది, నీ వుత్తరం చదివితే నువ్వు జయరామ్‌ని వదలి ఏ లోకానికి వెళ్ళలేవు అని తేలి పోయింది. ఇంక రెండోది ఆలోచించే తత్వం వున్నవాళ్ళు ఎక్కువగా సుఖపడలేరు. మూడు – నీకు తొందరలో పాపాయి పుట్టాలని ఆశీర్వదిస్తున్నా. నీ ఆలోచనలు అన్నీ ఎప్పుడు ఎల్లా వుంటాయో వ్రాస్తే చదవాలనివుంది. ఇంక నా అదృష్టాన్ని చాలా గొప్పగా వూహిస్తున్న నీకు అమాంతం నిస్పృహ కలిగించటం నాకు యిష్టంలేదు. పైగా మా పాప రాకతో మా మధ్య వో అగాధం పెరుగుతోంది. అని నీకు వ్రాసేందుకు నాకు చాలా బాధగావుంది. నువ్వు ఎప్పుడో జరిగిన సంఘటనలు తల్చుకుంటూ జీవితానికి దూరంగా వుండేందుకు ప్రయత్నిస్తున్నావు.

నిత్యం అవే నా జీవితంలో మరో విధంగా నీడల్లా తొంగి చూస్తూ వుంటాయి అంటే నువ్వు నమ్మగలవా? నువ్వు ఊహించినట్టు జయరామ్ సుధని చేసుకుంటాడన్న నమ్మకమేమిటి? చేసుకున్నా సుఖపడటంపట్టిమాట. వాళ్ళని కాలందూరం చేసింది. మళ్ళీ కలిసినా మధ్యనిలిచిన నీడలు భూతాల్లా పెరిగి ఆత్మల్ని మింగి జీవితావశేషంలో విరాగుల్ని చేస్తాయేమో? అయినా ఆ వూహాలన్నీ పట్టెవి. నువ్వు మళ్ళీ పూర్వంలా ఆరోగ్యంగా వుండాలి అని నా కోరిక. ఇన్నాళ్ళు ఎందుకు దాచావు: ఇంట్లో డాక్టర్ని పెట్టుకుని నువ్వు జబ్బుని పెంచుకున్నావంటే నీ మీద నాకు చాలా కోపంగావుంది. మనం వుండి సాధించలేనిది పోతేమాత్రం ఎవరికి నష్టం. అయినా ఎవరి జీవితం వాళ్ళది.

మీ అమ్మపోతే మీ నాన్న అంత మంచివాడుకూడా మళ్ళీ చేసుకోలేదా ఏమిటి !

ఇంకొకరి కోసం జీవిస్తున్నామన్నమాట వట్టిదే ! మన కోసమే మనం పాకులాడుతున్నాము. అది మాత్రం ప్రతివాళ్లు వప్పుకోవాలి. అవునా !

నీవుత్తరం మళ్లా చదువుకుని నీమనస్సు మార్చుకున్నట్లు మళ్లా నీవు వుత్తరం వ్రాస్తావని ఎదురు చూస్తూ వుంటా—

జయరామ్ మనస్సుకి పూర్తిగా అర్థమయినట్లు లేదు. చదివిందే పదిసార్లు చదువుకున్నాడు. అందులో పూర్తిగా అర్థమయింది సుధని చేసుకుంటే సుఖముండదు- అన్నవాక్యం. అదే ఆలోచన స్థిరపడింది. అంతా ఎదురు చూసినట్లు కాకుండా సుశీల బంధువు లమ్మాయిని చేసుకున్నాడు. సుధకి ఈసారి జయరామ్‌మీద ఏవగింపు కలిగింది. చుట్టుపక్కల స్నేహితులకి తమ వూహాలు తప్పినందుకు ఇదేమిటి ? పిచ్చాడు అని గర్వించారు. వంటావిడ కాలక్షేపానికి ఎన్నోకథలు పోగుచేసింది. వినేవాళ్ళకోసం నిరీక్షిస్తోంది.

జయరామ్‌ను సుశీలకి తను అన్యాయం చేశానేమో నన్న భయం విడవటంలేదు. కొత్తగావచ్చిన వధువును అపురూపంగా చూచుకొంటున్నాడన్న వార్త వంటింట్లో పుట్టింది. నెమ్మదిగా బజారుదాకా చేరింది. జయరామ్‌కి మార్పువచ్చింది బొగడచెట్టు నీడని కూర్చుంటే మనస్సు స్థిమితంగా వుంటోంది. చాలా పొద్దుపోయేదాకా జయరామ్ అక్కడే గడపటంతో సుశీలకి ఆ చోటంటే ఎక్కువ ఇష్టం అని విన్నవధువు మనస్సులో నల్లమబ్బులు కమ్ముతున్నాయి.

*